క్లుప్తంగా

బహుమతుల అందజేత

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఇన్‌డయాస్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారి విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేసోజు నవీన్, చంద్రయ్య, భాగ్యవతి, సరళ, అనసూయ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో బుధవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆదేశాల మేరకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కలమండల కృష్ణమ్మకు రూ.74 వేలు, మగాణి ఈశ్వరయ్యకు రూ.20 వేల చెక్కును వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, చందు, కిష్టమ్మ, లక్ష్మమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కొల్లాపూర్: స్థానిక పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ఓ ముస్లిం యువతి వివాహ ఖర్చుల కోసం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. యువతి తల్లి సబియాకు ఈ నగదును ఎమ్మెల్యే అనుచరులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అహ్మద్‌ఘోరీ నాయకులు గోపాలమల్లయ్య, ఫయాజ్, సాబేర్‌లున్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో సీతారామాంజనేయ స్వామి ఆలయం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం, విగ్రహదాత అండపల్లి జలంధర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఆలయాన్ని ప్రారంభించి ధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. అంతకు ముందు స్వామి వార్ల విగ్రహాలు, భజనలు, కోలాటంతో పాటు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరాజు, రాజలింగం, నిరంజన్, రేణయ్య, గురువయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన

లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బుధవారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ఆధ్వర్యంలో బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాలలో సౌకర్యాలను బృందం సభ్యులు పరిశీలించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దస్తగిరి, జనార్దన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కారు డ్రైవర్‌కు అభినందనల వెల్లువ

కొల్లాపూర్: ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కారు డ్రైవర్ ఓ యువకుడి ప్రాణం కాపాడారు. బుధవారం ఎమ్మెల్యే పట్టణంలోని 9 వవార్డులో మీకోసం–మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సమయంలో డ్రైవర్ మల్లికార్జున్ చౌనివీధిలోని కార్పెంటర్ జమీల్ ఇంటిముందు వాహనాన్ని నిలిపాడు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో జమీల్ కుమారుడు ఫెరోజ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన మల్లికార్జున్ వెంటనే ఇంట్లోకి వెళ్లి అతడిని కాపాడగా ఎమ్మెల్యే తదితరులు అభినందించారు. ఆత్మహత్య చేసుకోవడం సరైంది కాదని, జీవితంలో అన్ని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

స్నేహితుడికి అండగా..

లింగాల: ప్రమాదవశాత్తు ఇటీవల బైక్‌పై నుంచి కిందపడి ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన పోల నిరంజన్‌కు పదో తరగతి బ్యాచ్ మిత్ర బృందం అండగా నిలిచారు. మిత్రుడు త్వరగా కోలుకోవాలని రూ.36,500లను బుధవారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచిన మిత్రులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బి.శేఖర్, మల్లేష్, ముక్తార్, మురళి, గోపి, యాదిరెడ్డి, హబీబ్, మహబూబ్‌అలీ, అనిల్, దశరథం, రమేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివారి ఊరేగింపు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్ తిరుమలాపూర్‌లో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యం, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, యాదగిరి, భవనాచారి పాల్గొన్నారు.

2న పెద్దపల్లిలో జిల్లా స్థాయి పోటీలు

తెలకపల్లి: మండల పరిధిలోని పెద్దపల్లిలో బుగ్గా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 2వ తేదిన జిల్లా స్థాయి కబడ్డీ , ఖోఖో, కబడ్డీ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదిన బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నన్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఐతోల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు పరీక్షా కేంద్రంలో డీఎల్పీఓ రామ్మోహన్, ఎంపీడీఓ గంగమోహన్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్‌లు కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. రెండు కేంద్రాల్లో కలిపి 386 మందికి పరీక్షలు చేయించగా 40 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 23 మందికి అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. ఆపరేషన్ నిమిత్తం 16 మందిని గుర్తించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇస్మాయిల్ తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరంలో బుధవారం 174 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 27 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా 6 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యాధికారి జాన్సన్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: కంటి సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడు క్యాంపుల ద్వార కొనసాగుతోంది. బుధవారం 479 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 61 మందికి కంటి అద్దాల పంపిణీ, 41 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.



రఘుపతిపేటలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు బొప్పల్లి, పెద్దూరు, దాసుపల్లి, రాకొండలలో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. బుధవారం ఎంపీపీ కొమ్ము మధు, తెలకపల్లి కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమేశ్, టౌన్ అధ్యక్షుడు సత్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం స్థానిక బాలికల పాఠశాలలో విజయవంతంగా కొనసాగుతుందని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అవసరమైన వారికి మందులతో పాటు కంటి అద్దాల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వినోద్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆముదంలో సస్యరక్షణ చర్యలు

బిజినేపల్లి: యాసంగిలో రైతులు సాగు చేసిన ఆముదంలో సస్యరక్షణ చర్యలు కీలకమని అగ్రానమి శాస్త్రవేత్త డా. నళిని సూచించారు. బుధవారం మండలంలోని లట్టుపల్లి, అనుబంధ గిరిజనతండాలలో రైతులు సాగు చేసిన ఆముదం పంటను వ్యవసాయ పరిశోధన స్థానం, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో సాగు చేసిన ఆముదం పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆముదం పంటను దాసరి పురుగు, రసం పీల్చే పురుగు ఆశించిందని, దాని నివారణ కోసం ప్రొపినోఫాస్ 2మి.లీ



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త ఈశ్వర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

కల్వకుర్తిరూరల్: పాడిపరిశ్రమ ద్వార రైతులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి రమేశ్ కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన పశువుల ఉచిత గర్భకోశ వ్యాధులు, బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం పాడిరైతుల కోసం ఎన్నో రకాల కార్యక్రమాలను అమలు చేస్తుందని డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ మేరకు వెటర్నరీ ఏడీ జగదీశ్వరి, రైతులు దామోదర్‌రెడ్డి, పాండురంగారెడ్డి,



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రమేశ్

ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్, ప్రణీత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు చేస్తున్న రాములు యాదవ్

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో యాదవుల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు పెద్దమ్మ తల్లి, లింగమయ్య తదితర విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, జిల్లా అధ్యక్షులు శంకర్‌యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు మల్లేష్ యాదవ్, శ్రీను యాదవ్, విష్ణువర్ధన్ యాదవ్, లింగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అచ్చంపేట రూరల్: జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో ఈనెల 7న జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎండీ రవూఫ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు, అచ్చంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చందునాయక్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కృష్ణయ్య, సీనియర్ జర్నలిస్టులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బండారు శ్రీనివాస్, ప్రకాష్, సాయిబాబు, తిరుపతయ్య, సుధాకర్, రవీందర్, షఫీ, ప్రభాకర్, రవీందర్‌గౌడ్, రాములు, కర్నాటి శ్రీను, శ్రీనుయాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జర్నలిస్టులు

పౌష్టికాహారంపై అవగాహన



బాలామృతం అందజేస్తున్న సూపర్‌వైజర్ గిరిజ

మన్ననూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ అన్నారు. బుధవారం నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని ఫరహాబాద్, అప్పాపూర్, రాంపూర్, అగర్ల, చెంచు పెంటల్లోని గర్భిణులు, బాలింతల సర్వే నిర్వహించి వారికి ప్రభుత్వం తరుపున ఇచ్చే పౌష్టికాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో నిర్మల, పార్వతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వార అందజేస్తున్న పౌష్టికాహారంపై అంగన్‌వాడీ, ఆశావర్కర్లు ఇంటింటా తిరిగి అవగాహన కల్పించాలని సర్పంచ్ అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని బలాన్‌పల్లిలో పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు.

జిల్లాస్థాయి ఆంగ్ల పదజాల పరీక్షలు

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి ఆంగ్లపదజాల పరీక్షలు నిర్వహించారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలకు వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్ వెల్లడించారు. పరీక్షలను ఆంగ్లపదజాల పరీక్షల చైర్మన్ శ్రీకాంత్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కాశీపురం మహేష్, ఉపాధ్యాయులు నయూమ్, శంకర్, సులేమాన్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'ఉపాధి' పనులు

లింగాల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న వారందరికి పనులు కల్పించనున్నట్లు ఎంపీడీఓ గీతాంజలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అవుసలికుంట శివారులో ఉన్న తుర్కకుంటలో ఎంపీడీఓ ఉపాధి పనులను ప్రారంభించారు. కుంటలో పూడికతీత పనులను చేపడుతున్నట్లు, కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. ప్రతి కూలీ తమ జాబ్‌కార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. మస్టర్లలో బినామీలకు అవకాశం లేకుండా ఆధార్ నంబర్‌ను



పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, ఈసీ శ్రీనివాసులు, ఎఫ్‌ఏ మల్లేష్ పాల్గొన్నారు.

రామాలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు

కందనూలు: భీష్మ ఏకాదశి పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని రామాలయంలో నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ వారిచే విష్ణు సహస్రనామ పారాయణం 11 సార్లు పఠనం భక్తులచే సామూహికంగా చేసినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. కమిటీ సభ్యులు అర్థం రవీందర్, రమాదేవి, మన్నెపు రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

'మటన్ సెంటర్ల' నిర్ణయాన్ని విరమించుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈనెల 17న కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మటన్ సెంటర్లు ప్రారంభిస్తామనే నిర్ణయాన్ని విరమించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేశ్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆరె కటిక వృత్తి హైదరాబాద్‌లో వీధికొక్కడి మార్టు షాపులు ఓపెన్ చేసి ఆ షాపుల్లో మటన్ విక్రయాలు చేస్తుండడంతో వారి వృత్తి పూర్తిగా ధ్వంసం అయిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ మటన్ షాపుల ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

పెద్దకొత్తపల్లి: గ్రామాలలో అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వేగంగా పూర్తి చేయాలని డీపీఓ కృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు. అలాగే పెద్దకార్పాములలో పలు అభివృద్ధి పనులను డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఇళ్ల స్థలాల పట్టాలు ఉన్న ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇంటి స్థలం ఉన్న పేదలకు రూ. 5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిర్పతమ్మ, భాస్కర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఎల్‌పీఓ రామ్మోహన్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఉపాధి పనులపై అవగాహన కల్పించి పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోడేరు: మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల క్యాలెండర్ ఆవిష్కరణను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి ఆధ్వర్యంలో డాక్టర్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మధుయాదవ్, ప్రచార కార్యదర్శి వెంకటేష్, రమేష్, డాక్టర్ నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

4న ఈదమ్మ జాతర తైబజార్ వేలంపాట

కొల్లాపూర్: స్థానిక పట్టణ సమీపంలో ఐదు మంగళవారాలు సాగే ఈదమ్మ జాతర తైబజార్ వేలంపాట ఈనెల 4వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ రాజయ్య వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 4వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి వనరులపై విద్యార్థుల ప్రదర్శన

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్‌లో రావేప్ విద్యార్థులు ఆ గ్రామంలోని అభివృద్ధి వనరులపై సామాజిక పటం ద్వారా ప్రదర్శన నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన పీఆర్‌ఏ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో రైతులు సాగు చేసే నేలల విస్తీర్ణం, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, పాఠశాలలు వంటి వాటిని ఈ పటం ద్వారా వివరించారు. గ్రామానికి అందుబాటులో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలు వంటి వనరులను వివరించారు. నేలల స్వభావాన్ని వివరిస్తూ అక్కడ ఏ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయో వివరించారు. కార్యక్రమంలో పాలెం కేవీకే శాస్త్రవేత్త డా. ఆఫీసా జహన్, సర్పంచు సితార, ఎంపీటీసీ రఘుమారెడ్డి, రావేప్ విద్యార్థులు మోనిక, శివాని, రామాంజలి, రమాదేవి, అనూష, రుచిత, సాయి ప్రసన్న, భూమిక, శిరీష పాల్గొన్నారు.



సామాజిక పటాన్ని వివరిస్తున్న రావేప్ విద్యార్థులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం




బహుమతులు అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

తాడూరు: భారత తొలి మహిళా వ్యోమగామి కల్పన చావ్లా వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలంలోని మేడిపూర్ పాఠశాలలో నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడుతూ దేశంలో గొప్ప వారి జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకుని ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. బహుమతుల దాతగా వాసవి శ్రీకాంత్, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.వెంకటేష్, జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం సాయిప్రభ, ఉపాధ్యాయులు కర్దాకర్, శ్రీలత, నఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ ఫైల్స్‌ను పరిష్కరించాలి

పెద్దకొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైల్స్‌ను వెంటనే పరిష్కరించాలని కొల్లాపూర్ ఆర్డీఓ హనుమానాయక్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ ఫైల్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల ధరణి పెండింగ్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించి రైతులకు భూసమస్యలు లేకుండా చూడాలని ఆయన అన్నారు. రైతుల దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల వివరాలను తహసీల్దార్ శ్రీనివాసులును ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, ఆర్‌ఐ శివన్న గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైల్స్ పరిశీలిస్తున్న ఆర్డీఓ హనుమానాయక్

సైబర్ నేరాలపై అవగాహన

పెంట్లవెల్లి: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాల సమాచారం అడిగితే సమాధానం ఇవ్వకూడదని, ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలలో తెలియని వారికి వివరాలు చెప్పవద్దని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. తొందరపడి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సమాచారం ఇవ్వాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేశ్‌రెడ్డి

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

కల్వకుర్తిరూరల్: సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని సదర సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భీమయ్య కోరారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో నియోజకవర్గ స్థాయి సదర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తాలుకా గౌరవాధ్యక్షుడిగా ఎస్.దుర్గయ్య, తాలుకా అధ్యక్షుడిగా పడకంటి దుర్గయ్య సాగర్, ప్రధాన కార్యదర్శిగా దామోదర్, కోశాధికారిగా మురళీధర్, మండల అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా శేఖర్, యువజన కమిటీ అధ్యక్షుడిగా గోపి, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా శేఖర్ తదితరులు ఉన్నారు.

వరిలో యూరియా వాడకంపై అవగాహన

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో బుధవారం వరి పంటకు యూరియా వాడకంపై ఏఈఓ భరత్‌కుమార్ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసిన 25నుంచి 30 రోజుల వ్యవధిలో పొలంలో నీరు తక్కువగా ఉండేవిధంగా చూసుకొని ఎకరాకు 30 కేజీల యూరియాను చల్లుకోవాలని సూచించారు. రైతులు యూరియాను అధికంగా వేసుకుంటే పంటకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వేసుకుంటే ఆశించిన దిగుబడులు వస్తాయని ఏఈఓ సూచించారు.

గణిత బోధన సామగ్రి పంపిణీ

అచ్చంపేట: మండలంలోని ఐనోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు 1985 మిత్రమండలి ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో గణిత బోధన శాస్త్ర సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో పది జీపీఏ సాధించేందుకు, మెలకువలు తెలుసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. గణిత సామగ్రి విజయ దీపిక పుస్తకం ప్రాధాన్యతను ఆయన వివరించారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు మండికారి బాలాజీ, ఉపాధ్యాయులు సోమాని, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, పాండు పాల్గొన్నారు.



విద్యార్థులతో మిత్రమండలి సభ్యులు

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

అచ్చంపేట రూరల్: సంస్థాగతంగా ప్రతి గ్రామంలో బూతు కమిటీలు వేసి ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ కోరారు. బుధవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాలులో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి, నాయకులు తల్లోజు ఆచారి, బంగారు శృతి, జిల్లా ఇన్‌చార్జ్ మాధవి, దిలీప్‌చారి, సుధాకర్‌రావు హాజరై మాట్లాడారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, రేణయ్య, బాలాజీ, నాగరాజు, కొండల్‌రెడ్డి, భరత్‌చారి, రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

సమస్యల పరిష్కారానికి కృషి

కొల్లాపూర్: స్థానికంగా ఉండే సమస్యల పరిష్కారానికి అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మీకోసం–మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా కొల్లాపూర్ పట్టణంలోని 8వ వార్డులో పర్యటించారు. వార్డులో విద్యుత్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు చంద్రశేఖరాచారి, అహ్మద్‌ఘోరీ, గోపాలమల్లయ్య, జాఫర్, నరేందర్‌రెడ్డి, పరశురామ్‌గౌడ్, ఫయాజ్, కలీమ్, సాబేర్, విశ్వాస్ తదితరులున్నారు.



వార్డు పర్యటనలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి